## క్లుప్తంగా

### టాలెంట్ టెస్టుకు విశేష స్పందన



తెనాలిఅర్బన్: జేవీఎస్ క్రాంతి కోచింగ్ సెంటర్, ఎస్ఎస్ కంప్యూటర్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రకాశం రోడ్డులోని అకాడమీ కార్యాలయంలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. 250 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు జెట్టి విజయశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో జెట్టి ఏబినేజర్, ఎం.నవీన, డి.పద్మిని, కె.మైన, ఎం.సూర్య, షేక్ సల్మా, హర్షిత, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

### మూడు బుట్టల విధానాన్ని అమలు చేయండి

తెనాలిఅర్బన్: మూడు బుట్టల విధానాన్ని సక్రమంగా అమలు చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. బస్టాండ్ సమీపంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను ఆదివారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. రోడ్లపై ఎక్కడ చెత్త లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

### ఏపీ ఫార్మర్ పోర్టల్‌లో రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి



ఏవో ప్రేమ్‌సాగర్

తెనాలిటౌన్: ఏపీ ఫార్మర్ పోర్టల్‌లో రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం అందించే ప్రభుత్వ పథకాలు పొందాలంటే తప్పనిసరిగా ఏపీ ఫార్మర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ అయి ఉండాలని తెలియజేశారు. సొంత భూమి కలిగిన రైతులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం నుంచి ప్రతి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఈ సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. రైతుకు చెందిన పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డును తీసుకుని రైతు సేవా కేంద్రానికి వెళితే వ్యవసాయ సహాయకులు ఏపీ ఫార్మర్ పోర్టల్‌లో వివరాలు పొందుపరిచి యూనిక్ నంబర్ ఇస్తారని తెలియజేశారు. దీని వలన ప్రభుత్వం అందించే రైతు భరోసా, యంత్ర పరికరాలు, సబ్సిడీపై ఎరువులు, రుణమాఫీ, ధాన్యం సేకరణ వంటి సేవలు అందిపుచ్చుకోవచ్చని స్పష్టం చేశారు. రైతులు అందరూ ఈ సేవలను విధిగా వినియోగించుకోవాలని కోరారు.

### నేడు సర్వహేతేశ్వరస్వామి ఆలయ శంకుస్థాపన



సుబ్రహ్మణశర్మ

తెనాలి: పెదరావూరులోని మహావిద్యాపీఠం ఆధ్వర్యంలోని అభయ హస్త సుబ్రహ్మణ్య క్షేత్రంలో సోమవారం లక్ష్మీగణపతి, బాలాంబిక సమేత సర్వహేతేశ్వరస్వామి వార్ల కొత్త ఆలయ సముదాయ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య శంకర విజయేంద్ర సరస్వతీ మహాస్వామి సూచన ప్రకారం గణపతి, బాలాంబిక సమేత సర్వహితేశ్వరుడి ఆలయ నిర్మాణం తలపెట్టినట్టు నిర్వాహకులు సుబ్రహ్మణ్యశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామికి అభిషేకం చేసుకునేలా ఆలయ నిర్మాణం ఇక్కడ ప్రత్యేకతగా తెలియజేస్తూ, ఉదయం 11.12 గంటలకు జరిగే శంకుస్థాపన మహోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

### జాగ్రత్తలతో మధుమేహం అదుపు



తెనాలి: వంశపారంపర్యం, జీవనశైలి, ఒత్తిడి వంటి కారణాలు మధుమేహానికి దారితీస్తాయని ప్రముఖ వైద్యనిపుణుడు డాక్టర్ ఎస్వీ కృష్ణారావు చెప్పారు. తెనాలి సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నెలవారీ సమావేశం ఆదివారం సాయంత్రం జరిగింది. సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు అధ్యక్షత వహించారు. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎస్.వి.కృష్ణారావు మాట్లాడుతూ మధుమేహంపై అవగాహన కల్పించారు. తగిన జాగ్రత్తలతో మధుమేహాన్ని అదుపులో ఉంచవచ్చని చెప్పారు. సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం డాక్టర్ ఎస్.వి.కృష్ణారావు దంపతులను సత్కరించారు. కార్యదర్శి కావూరి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పీవీ రాంబాబు, అర్ భుజంగరావు, పి.మల్లికార్జునరావు, కె.చంద్రమౌళి, వెంకటేశ్వరరావు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి కలకలం



టిడ్కో భవనాల మధ్య మొలిచిన పిచ్చిమొక్కలు

**నత్తేనయం**

- కూటమి ప్రభుత్వం వచ్చి 8నెలలు దాటినా నేటికీ నగదు చెల్లింపుల్లేవు
- నిలిచిన టిడ్కో భవన నిర్మాణ పనులు
- అయోమయంలో లబ్ధిదారులు

తెనాలిఅర్బన్: పేద ప్రజల సొంతింటి కలకు టీడీపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వంలో హౌసింగ్ ఫర్ ఆల్ స్కీమ్ ద్వారా టిడ్కో గృహాల నిర్మాణాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్ట్ సంస్థ సుమారు 47 శాతం పనులు చేసింది. బిల్లులను ప్రభుత్వం నిలిపివేయంటంతో అప్పటి నుంచి పనులు ఆపేసింది. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్మాణ పనుల వేగానికి చర్యలు తీసుకోవడం లేదు. ఎనిమిది నెలలుగా బిల్లుల చెల్లింపులు చేయడం లేదు. ఫలితంగా టిడ్కో గృహ సముదాయ ఆవరణలో పిచ్చి మొక్కలు మొలిచాయి. విషసర్పాలు సంచరిస్తున్నాయి. అసాంఘిక కార్యకలాపాలకు ప్రాంగణం నిలయంగా మారింది.

**1,011 గృహాల నిర్మాణం లక్ష్యం**

తెనాలి పూలే కాలనీలో 13 ఎకరాలలో 1,011 గృహాలు నిర్మించాలని అధికారులు భావించారు. వీటి కోసం 21 బ్లాక్‌లు నిర్మించాలని ప్రణాళికలు రూపొందించారు. వీటిలో ఆరు బ్లాక్‌లలో 300 చ.గ ఫ్లాట్‌లు 288, 12 బ్లాక్‌లలో 365 చ.గ. ఫ్లాట్‌లు 579, మూడు బ్లాక్‌లలో 430 చ.గ. ఫ్లాట్లు 144 నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా లబ్ధిదారులను ఎంపిక చేసి 300.చ.గ. విభాగానికి రూ.500, 365 చ.గ. విభాగానికి రూ.50 వేలు, 430 చ.గ. విభాగానికి రూ.లక్ష మేర లబ్ధిదారులతో డీడీలు తీయించారు. మిగిలినది బ్యాంకులు రుణంగా సమకూరుస్తాయని సూచించారు. వీటి నిర్మాణ బాధ్యతలకు షాపోజీ–పల్లంజీ సంస్థకు అప్పగించారు. దీని కోసం రూ.60.87 కోట్ల నిధులను వెచ్చిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం నిర్మాణ పనులు ప్రారంభించారు. సుమారు 47 శాతం నిర్మాణ పనులు పూర్తికాగానే కాంట్రాక్టు సంస్థ పనులు నిలిపి వేసింది.

**రుణాలు చెల్లించాలని బ్యాంక్‌లు నోటీసులు**

టిడ్కో గృహాల కోసం రుణాలు మంజూరు చేసిన బ్యాంకులు లబ్ధిదారులకు నోటీసులు పంపుతున్నాయి. ఇళ్లు తమకు హ్యాండోవర్ చేయలేదని, రుణాలు ఎలా చెల్లించగలమని అడుగుతున్నా.. పట్టించుకోవడం లేదు. దీంతో లబ్ధిదారులు అసలు భవనాలు నిర్మించి ఇస్తారో లేదో తెలియక అయోమయానికి గురవుతున్నారు. బ్యాంకు రుణ వాయిదాలు పెండింగ్‌లో ఉండడంతో సిబిల్ స్కోర్ తగ్గుతోందని లబోదిబోమంటున్నారు. తమకు ఇళ్లు అప్పగించిన తర్వాత రుణ వాయిదాలు చెల్లించాలనే నిబంధన ఉందని, ముందే చెల్లించాలనడం సరికాదని చెబుతున్నారు.

**నేటికి విడుదల కాని రూ.28 కోట్ల నిధులు**

టిడ్కో భవన నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టు సంస్థ సుమారు రూ.28 కోట్ల మేర పనులు చేసింది. దీనికి సంబంధించిన బిల్లులను టిడ్కో విభాగానికి సమర్పించింది. కానీ ప్రభుత్వం బిల్లులకు సంబంధించిన నిధులు విడుదల చేయలేదు. ఇటీవల రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ టిడ్కో భవనాలపై సమీక్ష జరిపారు. వెంటనే బిల్లులు చెల్లింపులు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి మొదటి వారంలో పనులు ప్రారంభించాలని చెప్పారు. కానీ ఆ దిశగా అడుగులు పడలేదు.

**పనుల ప్రారంభానికి చర్యలు**

టిడ్కో గృహాల నిర్మాణం ప్రారంభానికి చర్యలు చేపడతాం. బిల్లులు వెంటనే చెల్లించేలా అధికారులు చూస్తున్నారు. కొంత నగదు కూడా కాంట్రాక్టు సంస్థకు జమ చేశాం. మిగిలిన నగదు కొద్దిరోజుల్లో జమయ్యే అవకాశం ఉంది. ఆ తర్వాత పనులు ప్రారంభించి జూన్‌లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

–సేతు బాబు, డీఈఈ, టిడ్కో విభాగం

## టెన్త్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించండి



మాట్లాడుతున్న ఎంఈవో-2 జయంతి బాబు

తెనాలిఅర్బన్: పదో తరగతి పరీక్షల్లో అందరూ మంచి మార్కులు సాధించాలని తెనాలి ఎంఈవో–2 వి.జయంతిబాబు పేర్కొన్నారు. చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం జరుగుతున్న స్టడీ అవర్స్‌ను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించేందుకు డైలీ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉపాధ్యాయుల తల్లిదండ్రులు కూడా విద్యార్థులపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థి జీవితంలో పదో తరగతి మైలురాయి అని, ఇక్కడ సాధించిన మార్కులు ఉద్యోగ జీవితానికి ముఖ్యమన్నారు. తెనాలి పట్టణ, మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులను ఏ,బీ,సీ గ్రేడ్‌లుగా విభజించి వారిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. సోమవారం నుంచి ప్రీ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయని, వాటికి సంబంధించిన పేపర్లు మండల పాయింట్‌కు చేరుకున్నట్లు వివరించారు. విద్యార్థులు ఉదయం, సాయంత్రం అదనంగా స్నాక్స్‌తో పాటు సెలవు రోజుల్లో మధ్యాహ్న భోజనం కూడా అందిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముగిసిన హిందీ పరీక్షలు



తెనాలి: దక్షిణ భారత హిందీ ప్రచారసభ (ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో రెండురోజుల హిందీ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. పట్టణంలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలుర హైస్కూలు, దొడ్డపనేని ఇందిర బాలికల మున్సిపల్ హైస్కూలులో శనివారం, ఆదివారం రెండురోజులపాటు ప్రాథమిక నుంచి ప్రవీణ వరకు పరీక్షలు జరిగాయి. ఎటువంటి సమస్యలు లేకుండా ప్రశాంతంగా పూర్తయ్యాయి. గతంతో పోల్చుకుంటే ఈసారి పరీక్షలకు హాజరైన విద్యార్థుల సంఖ్య తగ్గినట్టు కనిపించింది.

## సేవా భగవాన్ పురస్కారాలు ప్రదానం



శివశంకర్‌కు పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు



ఈఎల్‌వీ అప్పారావుకు పురస్కారం అందజేస్తున్న కమిటీ సభ్యులు

తెనాలిఅర్బన్: తెనాలికి చెందిన సత్యం శివం సుందరం సామాజిక సేవా కేంద్రం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్, వీరబ్రహ్మేంద్ర చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఈఎల్‌వీ అప్పారావుకు సేవా భగవాన్ పురస్కారాలను చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, కమిటీ సభ్యులు అందజేశారు. జయ జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో చిలకలూరుపేటలోని మెడికల్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం సేవా భగవాన్ 2025 పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. పురస్కారాలు అందుకున్న వీరిని జయ జయ జయ సాయి ట్రస్ట్ వ్యవస్థాపకులు పూసపాటి బాలాజీ, సభ్యులు అభినందించి సత్కరించారు.

## వరిగడ్డి వామికి నిప్పు



తాడికొండ: వరిగడ్డి వామికి నిప్పంటుకుని మంటలు రేగిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. వివరాల మేరకు.. గ్రామంలోని ప్రధాన రహదారి వెంట మూలస్థానేశ్వర స్వామి ఆలయం పక్కన ఉన్న గోశాలలో పశువుల మేత కోసం వరిగడ్డిని నిల్వ చేశారు. ఈ వరిగడ్డి వామికి ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలు ఆర్పేందుకు యత్నించగా అదుపులోకి రాకపోవడంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సచివాలయ ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలార్పేందుకు రెండు గంటలకు పైగా సమయం వెచ్చించారు. ఈ ప్రమాదంలో రూ.20 వేలు విలువ చేసే వరిగడ్డి తగలబడినట్లు స్థానికులు చెబుతున్నారు.

## తెనాలిలో హనుమాన్ చాలీసా పోటీలు



హనుమాన్ చాలీసా పోటీల్లో గానం చేస్తున్న చిన్నారి

తెనాలి: పట్టణానికి చెందిన సంగీత సంస్థ శ్రీలక్ష్మీశారద సంగీతాలయం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నెహ్రూ రోడ్డులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత గోవర్ధనస్వామి ఆలయంలో విద్యార్థులకు శ్రీహనుమాన్ చాలీసా పోటీలను నిర్వహించారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు గౌరావఝుల ఆంజనేయశాస్త్రి నిర్వహణలో బాలురు, బాలికల్లో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. హనుమాన్ చాలీసాలోని శ్లోకాలపై నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.3 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.2 వేలు, తృతీయ బహుమతిగా రూ.వెయ్యి అందజేశారు.

జూనియర్స్‌లో వి.పార్థు కృష్ణసాయి, అందె తన్మయి, పి.లక్ష్మీప్రణతి, సీనియర్స్‌లో ఎస్.సుచరిత, పి.రత్నప్రియాకం, జి.గ్రీష్మసాయితేజస్వి విజేతలుగా నిలిచారు. మరో తొమ్మిది మందికి కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. న్యాయనిర్ణేతలుగా ఆరాధ్యుల ఆదినారాయణరావు, ఉప్పులూరి శారదచలపతి వ్యవహరించారు. గౌరావఝుల సౌజన్య, కొండపి శ్రీనివాసరావు, అందె బాల చంద్రమౌళి, రాజేశ్వరి, ఆలయప్రధాన అర్చకుడు రఘు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### అనాథ శరణాలయానికి నిత్యావసరాల వితరణ



చినకాకాని(మంగళగిరి): విజయవాడ చిట్టినగర్ గౌతమ్ స్కూలు ఆధ్వర్యంలో శ్రీ షిర్డి సాయి సేవా సమితి అధ్యక్షుడు కృష్ణ శేఖర్ సహకారంతో అనాథ ఆశ్రమానికి రూ.30 వేల విలువైన నిత్యావసర సరకులు అందజేశారు. ఆదివారం నగర పరిధిలోని చినకాకాని షైన్ అనాథ ఆశ్రమానికి అందజేయగా ఆశ్రమ నిర్వాహకులు డీజీ నాయక్ దాతల చేతుల మీదుగా సరకులు అందుకుని వారికి ధన్యవాదాలు తెలిపారు.

## దేశంలో ఫాసిజం పెరిగిపోతోంది



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.తిరుపతయ్య

మంగళగిరి: దేశంలో ఫాసిజం రోజు రోజుకు పెరిగిపోతోందని తెలంగాణ మానవ హక్కుల వేదిక అధ్యక్షుడు డాక్టర్ ఎస్.తిరుపతయ్య పేర్కొన్నారు. నగర పరిధిలోని నిడమర్రు చార్వాక ఆశ్రమంలో రెండు రోజులు పాటు నాస్తికా మేళా ఆదివారంతో ముగిసింది. జన విజ్ఞాన జాతీయ అధ్యక్షురాలు ఎస్.స్వరాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగన సమావేశంలో వక్తలు మాట్లాడారు. భారత దేశంలో ఫాసిజం అనే అంశంపై డాక్టర్ తిరుపతయ్య మాట్లాడుతూ ఫాసిజం పెరగడంతో ప్రజాస్వామ్య హక్కులు హరించబడుతున్నాయన్నారు. మతం పేరుతో మైనార్టీలపై దాడులు చేస్తున్నారని, స్త్రీల హక్కులు అణిచివేయబడుతున్నాయన్నారు. హక్కుల గురించి ప్రశ్నించిన వారిని జైలులో పెడుతున్నారని విమర్శించారు. పెరుగుతున్న ఫాసిజం మన కర్తవ్యాలు అను అంశంపై విద్యాపరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ పాలకులు అన్ని రంగాలను తమ గుప్పిట్లో పెట్టుకుని ప్రజల మధ్య కుల, మత చిచ్చు పెడుతున్నారన్నారు. కుల నిర్మూలన పోరాట జాతీయ నాయకుడు కృష్ణ మాట్లాడుతూ ఈ దేశంలో కులం లేని జాగా అంటూ లేదన్నారు.కుల దోపిడికి వ్యతిరకంగా ప్రజలను చైతన్యవంతులను చేసి వారిలో అవగాహన పెంచాల్సిన అవసరం వుందన్నారు.

## గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



ఉపాధ్యాయుడు కొప్పుల రాజు (ఫైల్)

మంగళగిరి టౌన్: దొండపాడుకు చెందిన ఉపాధ్యాయుడు కొప్పుల రాజు (50) అకస్మాత్తుగా ఆదివారం సాయంత్రం గుండెపోటుతో దొండపాడులోని ఆయన నివాసంలో మృతి చెందారు. ఆయన మంగళగిరి నగర పరిధిలోని కాంద్రు కమల మున్సిపల్ పాఠశాలలో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా 24 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. విషయం తెలుసుకున్న తోటి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు, మంగళగిరి ఎంఈఓ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతదేహానికి నివాళులర్పించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమవారం స్వగ్రామం దొండపాడులో అంత్యక్రియలు జరుగనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. మంగళగిరి ఎంఈఓ బాబు, ప్రధానోపాధ్యాయులు దరియావలి, శ్రీనివాసరావు, సైదా నాయక్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

## కమనీయం సీతారాముల కల్యాణం



స్వామివారి కల్యాణోత్సవం

తెనాలి: స్థానిక షరాఫ్‌బజారులోని సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈనెల 14 వరకు నిర్వహించే బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు సీతారాముల కల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో, మారుతీ మిత్ర బృందం కల్యాణ ఘట్టాన్ని కమనీయంగా నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు స్వామి తిరుచ్చి వాహన సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పంచముఖ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలను వైఖానస ఆగమరీతిన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన బృందానికి చెందిన ఆర్వీ కిరణ్ కుమార్, ఆర్.సురేష్, వ్యవస్థాపక కుటుంబ సభ్యులు నిఖిల్ శాండిల్య, సంకీర్తన బృందం ముఖ్యులు మూర్తి అనురాధ, విఖనస శ్రీనివాస ట్రస్ట్ సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, మడుపల్లి చంద్రశేఖర్, జంధ్యం రామారావు, గుడివాడ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం



అయితానగర్‌లో ఎన్నికల ప్రచారం

తెనాలి: కృష్ణా–గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి తిరిగి పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు ఓటర్లను కోరారు. వివిధ సంఘాల నాయకులు ఆదివారం స్థానిక అయితానగర్‌లో ఎన్నికల ప్రచారం ఆరంభించారు. ఉపాధ్యాయులు, పెన్షనర్లు, నిరుద్యోగులు, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు, కౌలు రైతులు, విద్యార్థి, యువజన, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు తదితర సామాజిక తరగతుల సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించే నాయకుడు లక్ష్మణరావుగా గుర్తుచేశారు. ఆయా వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి ఆయన చేసిన కృషిని నాయకులు వివరించారు. ఈనెల 27వ తేదీన జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో లక్ష్మణరావును మరోసారి గెలిపించుకుని అండగా నిలుపుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి, పిల్లి రాజశేఖర్, శ్యానం ప్రకాష్, పిల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సేవా సదనంలో కోలుకుంటున్న మానసిక బాధితుడు



సేవాసదనంలో బాధితుడితో కమిషనర్ బండి శేషన్న

తెనాలి: రోడ్డువెంట మాటాపలుకు, దుస్తులు లేకుండా సంచరించిన వ్యక్తి గోరంట్లలోని కార్మెల్ సేవా సదనంలో కోలుకుంటున్నాడు. స్థానిక కొత్తపేటలో ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో ఏళ్లతరబడి రోడ్డుపై గడుపుతున్న వ్యక్తి దుస్థితిపై ఈనెల ఆరో తేదీన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. అదేరోజు గుంటూరు సమీపంలోని గోరంట్లలో గల కార్మెల సేవాసదనాన్ని సంప్రదించారు. వారు ఆ రాత్రి ప్రాంతంలో వాహనంలోకి ఎక్కించుకుని తీసుకెళ్లారు. అక్కడకు వెళ్లిన వెంటనే క్షురకర్మ చేయించి, స్నానం చేయించి దుస్తులు తొడిగారు. సేవాసదనంలో ఆశ్రయం పొందుతున్న ఆ వ్యక్తి యోగక్షేమాలను తెలుసుకునేందుకు ఆదివారం తెనాలి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అక్కడకు వెళ్లారు. పరిశుభ్రంగా కనిపిస్తున్న అతడిని పలకరించాడు. కొన్ని ప్రశ్నలకు జవాబులు ఇచ్చిన అతడు, గతానికి సంబంధించిన కొన్ని అంశాలను పొంతన లేకుండా చెప్పాడట! ఇన్నేళ్లుగా ఎవరితోనూ పలకని వ్యక్తి ఇప్పుడు మాట్లాడుతుండటాన్ని చూసి కమిషనర్ సంతోషించారు. కొన్నిరోజులైతే స్వస్థత చేకూరుతుందన్న ఆశాభావాన్ని సేవాసదన్‌లోని సేవకులు వెలిబుచ్చారని తెలిపారు.

## స్విమ్మింగ్ పోటీల్లో విజేతలకు సన్మానం



బహుమతులు సాధించిన స్విమ్మర్స్

తెనాలిటౌన్: కృష్ణా రివర్ క్రాసింగ్ స్విమ్మింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచి బహుమతులు సాధించిన పలువురు సభ్యులను సంగంజాగర్లమూడి స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. మండలంలోని సంగంజాగర్లమూడి గ్రామంలో ఆదివారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో సంగంజాగర్లమూడి స్విమ్మర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఫిబ్రవరి 2వ తేదీన నిర్వహించిన కృష్ణా రివర్ క్రాసింగ్ పోటీల్లో సంగం జాగర్లమూడికి చెందిన స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు 20 మంది పాల్గొన్నట్టు తెలిపారు. 31 నుంచి 40 సంవత్సరాలు గ్రూప్‌లో 3వ బహుమతి సాధించిన టి.నాగ బ్రహ్మారెడ్డిని దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు పాదిలి వాసు, నారాయణ ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలియజేశారు. అదే విధంగా స్విమ్మర్ అసోసియేషన్ సభ్యుడు అయిన జి.అర్జునరావు సబ్‌రిజిస్ట్రార్‌గా ఉద్యోగ విరమణ పొందిన నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జె.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, కేబుల్ శ్రీను, బాల, రాఘవరెడ్డి, జనార్ధన్, రాఘవ, నీరంజన్, పాలడుగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ రవీంద్రనాయక్

మంగళగిరి టౌన్: రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగకుంటే చర్యలు తప్పవని మంగళగిరి పట్టణ ఎస్ఐ రవీంద్రనాయక్ హెచ్చరించారు. నగర పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర నాయక్ మాట్లాడుతూ అల్లర్లకు, అలజడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. చెడు నడత కలిగిన రౌడీషీటర్లపై పోలీసుల నిఘా ఉంటుందని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రౌడీషీట్ నమోదైన ప్రతి ఒక్కరు స్టేషన్‌లో సంతకాలు చేస్తుండాలని చెప్పారు. బయట ప్రాంతాలకు వెళ్లే సమయంలో స్టేషన్ అధికారి అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికలపై అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ సిబ్బంది ఏడుకొండలు, బాబూరావు, సుధీర్, శ్రీరామ్ పాల్గొన్నారు.

## ప్రార్థనతోనే పాపాలు దూరం

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ దేవుడిని ప్రార్థించడం ద్వారానే తమ పాపాలు దూరం అవుతాయని ఫాదర్ టి.రాజా సురేష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాలఏసు దేవాలయంలో ఆదివారం దివ్యపూజాబలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ టి.రాజా సురేష్‌రెడ్డి వాక్యోపదేశం చేస్తూ దేవుడి ఆజ్ఞతోనే ప్రతి పనిని చేసి విజయం సాధించగలుగుతామన్నారు. భగవంతుడుని ప్రార్థించడం ద్వారా మనకు సరైన మార్గాన్ని చూపొతాడన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ విచారణ గురువులు ఎం.ఫాతిమా మర్రెడ్డి, కథోళిక క్రైస్తవులు పాల్గొన్నారు.